క్లుప్తంగా

‘ఆదర్శ’లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గానూ ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ కోరారు. గత మార్చిలో పదోతరగతి ఉత్తీర్ణులైనవారు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులకు ఎలాంటి రుసుము లేకుండా ఈ నెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు ఉచిత వసతిగృహ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు.

రైతు రుణమాఫీకి సీఎం ఆదేశంపై హర్షం

సైదాపూర్: ఆగస్టు 15లోగా రైతు రుణమాఫీ చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడంపై డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్ రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు దొనకొండ సురేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం సైదాపూర్ మండల కేంద్రంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయని, ఇక నుంచి ప్రభుత్వం పాలనపై దృష్టిసారించి, పథకాల అమలుకు శ్రీకారం చుడుతుందని సీఎం పేర్కొన్నారని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి, హామీలను అమలు చేయని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ హామీలు నెరవేర్చడం లేదని విమర్శించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

పశుగ్రాసం అందజేత



పశుగ్రాసం అందించిన శ్రీనివాస్

శంకరపట్నం: మండలంలోని గొల్లపల్లికి చెందిన మేకల శ్రీనివాస్ అనే రైతు రెండు ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని గురువారం వేములవాడ రాజన్న గోశాలకు అందజేశారు. ఆయనను గోశాల నిర్వాహకులు అభినందించారు.

గాలివాన.. విద్యుత్ సరఫరాకు అంతరాయం

మానకొండూర్: మండలంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. చెంజర్ల, ఈదులగట్టెపల్లి, ఖాదర్‌గూడెం గ్రామాల్లోచెట్ల కొమ్మలు విరిగి, విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు ఇబ్బంది పడ్డారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శంకరపట్నం: మండలంలోని ఇప్పలపల్లికి చెందిన చింతిరెడ్డి అమృత అనే వృద్ధురాలు ఈ నెల 13న ఓటు వేసి ఇంటికి వచ్చి, అదేరోజు రాత్రి మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ గురువారం పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొన్న లారీ



మానకొండూర్: మండలంలోని గట్టుదుద్దెనపల్లి శివారులో గురువారం ఓ లారీ టిప్పర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కరీంనగర్ వైపు వెళ్తున్న లారీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టిందని గ్రామస్తులు తెలిపారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజ

చొప్పదండి: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 331వ ఆరాధన గురుపూజ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు చొప్పదండి పట్టణంలోని హరిహర క్షేత్రం నిర్వాహకులు తెలిపారు. బ్రహ్మంగారి గుడి ఆవరణలో వైశాఖ శుద్ధ దశమిని పురస్కరించుకొని, ఉదయం అభిషేకం, అనంతరం హోమం, మధ్యాహ్నం అన్నదానం చేపడుతామన్నారు. రాత్రి భజన కార్యక్రమాలు ఉన్నందున భక్తులు అధిక సంఖ్యలో హాజరై, విజయవంతం చేయాలని

శిశుగృహ చిన్నారి దత్తత

కరీంనగర్: కరీంనగర్ శిశుగృహలో పెరుగుతున్న ఏడాదిన్నర పాపను హైదరాబాద్‌కు చెందిన పిల్లలు లేని దంపతులకు అధికారులు దత్తత ఇచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ఈ దత్తత కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో శాంత, పీఓ తిరుపతి, శిశుగృహ మేనేజర్ తేజస్వి, సోషల్ వర్కర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు



చొప్పదండిలో..

పోచమ్మ బోనాలు

హుజూరాబాద్: హుజూరాబాద్‌లో గురువారం సాయంత్రం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గొల్లవాడ నుంచి యాదవ కులస్తులు బోనాలతో సిర్సపల్లి క్రాస్ రోడ్‌లోని పోచమ్మ దేవాలయానికి వెళ్లి, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు బద్దుల రాజ్‌కుమార్, కౌన్సిలర్ మక్కపల్లి కుమారస్వామి, ఉత్సవ కమిటీ చైర్మన్ సింగరేణి సమ్మయ్యలు, సంఘం నాయకులు తొర్రి చిన్న సమ్మయ్య, భాషబోయిన సదానందం, భాషబోయిన ఓదెలు, గంద్రకోట రమేశ్, గంద్రకోట సారయ్య, మక్కపెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలో కుర్మ సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. బీరయ్య, మహంకాళి ఉత్సవాల్లో భాగంగా మహిళలు ఇంటికో బోనం తీసి, ర్యాలీగా బీరయ్య గుడికి వెళ్లి, మొక్కులు చెల్లించుకున్నారు. ఒగ్గు కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

ఎల్లుండి నుంచి ‘సుందరగిరి’ బ్రహ్మోత్సవాలు

- 27వ తేదీ వరకు నిర్వహణ
- భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి
- దాదాపు 2 వేల మంది రాక
- 50 ఏళ్లుగా ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించని పాలకులు



ముస్తాబైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం



కొలువైన స్వామివారు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామివారు భక్తుల కొంగుబంగారమై విరాజిల్లుతున్నారు. మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. ఈ దేవస్థానం అతి పురాతనమైనది. ఏడాదిలో బ్రహ్మోత్సవాలు, సంక్రాంతికి ఒకరోజు ముందు గోదాదేవి కల్యాణం జరుగుతాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు స్వామివారికి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు.

ఆలయ చరిత్ర ఇదీ..

5వ శతాబ్దంలో సందేవార్, సర్ మన్నెవార్ సోదరులకు వేంకటేశ్వరస్వామివారు కలలో కనిపించి, తాను ఇక్కడ స్వయంభూగా వెలిశానని, పూజలు చేయాలని ఆజ్ఞాపించారట. మరుసటి రోజు ఉదయం గుట్టపైకి వెళ్లి చూడగా ఓ గుండుపై తిరుమణి, తులసి దళం కనిపించాయట. దీంతో వారు అక్కడే ఆలయం నిర్మించి, పూజలు జరిపించారట. తర్వాత గుట్టపైకి వెళ్లడం అందరికీ సాధ్యం కాదని భావించి, గణపురపు దేశ్‌ముఖ్ కొన్న రామచందర్‌రావు గుట్ట కింద ఆలయం నిర్మించారని చరిత్ర చెబుతోంది.

ఈ నెల 27 వరకు ఉత్సవాలు

సుందరగిరి శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 19వ తేదీ నుంచి 27 వరకు నిర్వహించనున్నారు. 23న గురువారం ఉదయం 5 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ, 7 గంటలకు నిత్యనిధి, 11 గంటలకు కల్యాణం జరిపించనున్నారు. 26న ఆలయం చుట్టూ బండ్లు తిరుగుట, శకటోత్సవం, 27న రథోత్సవం నిర్వహిస్తారు.

తరలిరానున్న భక్తులు.. ఏర్పాట్లు

చిగురుమామిడి మండలంతోపాటు హుస్నాబాద్, కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, ముంబయి, సిరిసిల్లతోపాటు పలు పట్టణాలు, నగరాల నుంచి దాదాపు 2 వేల మంది భక్తులు తరలిరానున్నారు. ఆలయ కమిటీవారు చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, లైటింగ్, దాతల సాయంతో మూత్రశాలలు ఏర్పాటు చేయించారు.

ఆలయాన్ని పట్టించుకోని పాలకులు

సుందరగిరి దేవస్థానాన్ని 50 ఏళ్లుగా పాలకులు పట్టించుకోవడం లేదు. నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తామన్న కల్యాణ మండపం ఊసేలేదు. భక్తులు ఉండేందుకు మూడు ధర్మశాలలు మాత్రమే ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్రంలోనూ పరిస్థితి మారడం లేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి కృషి చేస్తా



సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా. గుట్ట కింది నుంచి పైకి మెట్లు నిర్మించాం. ఘాట్‌రోడ్డు ప్రారంభ దశలో ఉంది.


– గందె సంపత్, ఆలయ కమిటీ చైర్మన్

తాగునీటికి తండ్లాట



పూర్తిగా ఎండిపోయిన వెదిర గ్రామ నావుల కుంట చెరువు

- బావుల్లో అడుగంటిన నీరు
- ఎండిన చెరువులు, కుంటలు
- రెండు, మూడు రోజులకోసారి కూడా రాని ‘మిషన్ భగీరథ’
- ప్రజల ఇబ్బందులు
- రామడుగు మండలంలో పరిస్థితి



కోనరావుపేట తాగునీటి బావిలో అడుగంటిన నీరు



ఎండిపోయిన గుండి ఊర చెరువు

రామడుగు: మండలంలో తాగునీరు సరఫరా చేస్తున్న బావుల్లో నీరు అడుగంటిపోయింది. దీంతో గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అధికారులు నానాతంటాలు పడుతున్నారు. భూగర్భజలాలు పడిపోవడమే సమస్యకు ప్రధాన కారణం. దీనికి తోడు గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు కూడా ఆశించిన స్థాయిలో సరఫరా కాకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

గంటసేపు కూడా నీరందించట్లే..

రామడుగు మండలంలో 23 గ్రామాలున్నాయి. గ్రామ పంచాయతీల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న బావుల్లో భూగర్భజలాలు భారీగా పడిపోయాయని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. దీంతో తాగునీటి సరఫరా ఇబ్బందికరంగా మారిందని అంటున్నారు. బావుల్లో 15 మీటర్లపైనే నీటి మట్టం పడిపోయిందని, ఫలితంగా అవి గంటసేపు కూడా నీరందించలేని స్థితికి చేరాయని పేర్కొంటున్నారు.

తగ్గిన నీటిమట్టం

చెరువులు, కుంటలు, వాగుల సమీపాన బావులు తవ్వి, తాగునీరు సరఫరా చేసేలా అధికారులు గతంలో చర్యలు తీసుకున్నారు. అయితే, ప్రస్తుతం రామడుగు మండలంలోని అన్ని చెరువులు, కుంటలు ఎండిపోవడంతో ఆయా బావుల్లో నీటి మట్టం తగ్గిపోయింది.

‘మిషన్ భగీరథ’ రావట్లే..

గత ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం నీరు రాకపోవడంతో గ్రామాల్లో ఉన్న పాత బావుల నుంచే తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మిషన్ భగీరథ నీరు రెండు, మూడు రోజులకోసారి కూడా రావడం లేదని, బావుల నీరు ఆశించిన స్థాయిలో అందడం లేదని, తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన ఉండాలి





హుజూరాబాద్‌లో ర్యాలీ తీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో, వైద్యులు, సిబ్బంది, జమ్మికుంట పట్టణంలో..

హుజూరాబాద్: డెంగీ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు అన్నారు. గురువారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హుజూరాబాద్ పట్టణంలో వైద్య సిబ్బంది డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల వల్ల వ్యాధి వస్తుందని, అవి కుట్టకుండా, వృద్ధి చెందకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రవికిరణ్, సాజిద్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: డెంగీ వ్యాధి నివారణ అందరి బాధ్యత అని, ప్రతీ వారం ఫ్రైడేను డ్రై డేగా పాటించాలని చిగురుమామిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి విప్లవశ్రీ అన్నారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. దోమలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎడిస్ దోమ వల్ల డెంగీ ప్రబలుతుందన్నారు. తీవ్ర తలనొప్పి, జ్వరం, శరీరంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు వ్యాధి లక్షణాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు హారిక, అఫ్సానా, ఫార్మసిస్ట్ రామేశం, స్టాఫ్‌నర్స్ భారతి, సూపర్‌వైజర్ ఆజీబాబా, హెల్త్ అసిస్టెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి వి.తులసీదాస్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గురువారం ర్యాలీ చేపట్టారు. డెంగీ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యులు కల్యాణ్, శ్రీదేవి, కమ్యూనిటీ హెల్త్ అధికారి శ్యామల, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

జమ్మికుంట: మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు, దాని పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాల వైద్యులు, సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి జ్వరాలు రాకుండా ఉండాలంటే దోమలు ఇంట్లోకి రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటి ఆవరణలో పాత టైర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, కొబ్బరి చిప్పలు, పాత సామగ్రి లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. డ్రమ్ములు, డబ్బాల్లోని నిల్వ నీటిని పారబోయాలని సూచించారు. శుద్ధమైన నీటినే తాగాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు ఫర్హానుద్దీన్, కార్తీక్, మహోన్నత, హిమబిందు, చందన, సంధ్యారాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు రత్నకుమారి, అరుణ, స్వరూప, సదానందం తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని పాఠశాలను సీజ్ చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కరీంనగర్: నగరంలో అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలను సీజ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని జ్యోతిరావుపూలే గ్రౌండ్ వెనుక అనుమతి లేకుండా అడ్మిషన్లు, ప్రచారం నిర్వహిస్తున్న పాఠశాల వద్ద ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలకు అనుమతులు రాకముందే ప్రచారం, అడ్మిషన్లు నిర్వహిస్తున్నా విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్వహణలో ఉన్న, ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకొని, అనుమతి లేని పాఠశాల పేర్లు బహిర్గతం చేయాలని లేని పక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో డీఈఓ ఛాంబర్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామరావు వెంకటేష్, మచ్చ రమేశ్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి హేమంత్, జిల్లా ఉపాధ్యక్షుడు సాగర్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయక్, నాయకులు సందీప్‌రెడ్డి, వినయ్ రెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీనే ఉపకులపతిగా నియమించాలి

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీకి బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినే ఉపకులపతిగా నియమించాలని బీసీ కులాల ఐక్య వేదిక, శాతవాహన యూనివర్సిటీ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ ఫోరం సమన్వయకర్త పెంచాల శ్రీనివాస్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలు నిర్లక్ష్యానికి గురి అయ్యాయన్నారు. యూనివర్సిటీలకు వెంటనే ఉపకులపతులను నియమించాలని, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీకి బీసీ వ్యక్తిని నియమించాలని కోరారు. బీసీ సంఘం నాయకులు శ్రీధర్ రాజు, కనుకయ్య, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘బోనస్’పై నాలుక మడతేసిన కాంగ్రెస్





చొప్పదండి తహసీల్ కార్యాలయంలో మెమొరాండం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, మానకొండూర్‌లో వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

చొప్పదండి: వరి ధాన్యానికి బోనస్ చెల్లించే విషయంలో కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఒకలా, తర్వాత ఒకలా వ్యవహరిస్తోందని, ఆ పార్టీ మోసం బట్టబయలైందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బోనస్ సన్న వడ్లకు మాత్రమే ఇస్తామనడంపై చొప్పదండిలో బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓట్లు డబ్బాలో పడగానే రైతులతో కాంగ్రెస్‌కు అవసరం తీరిపోయిందని, ఇప్పుడు నాలుక మడతేసిందని విమర్శించారు. రాష్ట్రంలో 90 శాతం మంది అన్నదాతలు దొడ్డు వడ్లు పండిస్తారని, వారిని ప్రభుత్వం మోసం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మినుపాల తిరుపతిరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, వినయ్‌కుమార్, కౌన్సిలర్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

మానకొండూర్ రూరల్: అబద్ధపు హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ గద్దెనెక్కిందని, వరి ధాన్యానికి రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పటివరకు చేయలేదని మండిపడ్డారు. అనంతరం డీటీ సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు, జెడ్పీటీసీ సభ్యుడు శేఖర్, నాయకులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ నాయకులు..

హుజూరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై స్థానిక ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు గురువారం నిరసన తెలిపారు. రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారని, అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సన్న ధాన్యానికే ఇస్తామనడం ద్వారా రాష్ట్ర రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మోసం చేసిందని మండిపడ్డారు. బోనస్‌తోపాటు మద్దతు ధర చెల్లించి, ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు పడదం బక్కారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడూరు ప్రతాపరెడ్డి, నాయకులు వర్ధినేని రవీందర్‌రావు, సంగెం ఐలయ్య, లక్ష్మారెడ్డి, దయాకర్ రెడ్డి, బెల్లి రాజయ్య, కిరణ్, తిరుపతియాదవ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ‘వెలిచాల’



కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో జరిగిన పోలింగ్ సరళిపై సీఎం ఆరా తీశారు. నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు పార్టీ శ్రేణులు సమన్వయంతో గట్టిగా పోరాడారని వెలిచాలను అభినందించారు.

27 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- ముగ్గురిపై కేసు



పోలీసులు పట్టుకున్న బియ్యం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ శివారులో తరలించేందుకు సిద్ధంగా ఉన్న 27 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు హుజూరాబాద్ టౌన్ సీఐ రమేశ్, ఎస్సై సాంబయ్య తెలిపారు. బియ్యం ఉన్న ట్రాలీ ఆటోను సీజ్ చేశామన్నారు. కందుగుల గ్రామానికి చెందిన బత్తుల ఆకయ్య, గంట అనిల్, నర్రావుల అనిల్‌లను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ముగ్గురూ గ్రామాల్లో ప్రజల వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి, అనంతసాగర్‌లోని కోళ్ల ఫారాలకు తరలిస్తున్నారని తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసినా, తరలించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

యునెస్కో సమావేశానికి ఆహ్వానం



మల్లారెడ్డి

కరీంనగర్‌సిటీ: యువత కోసం సమర్థవంతమైన వ్యవస్థాపకత విద్యా వ్యూహాల రూపకల్పన గురించి ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో అక్టోబర్ 10, 11వ తేదీల్లో జరగనున్న విద్యా సమావేశానికి యునెస్కో ఆహ్వానం పంపినట్లు ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ మల్లారెడ్డి తెలిపారు. సమావేశంలో వ్యవస్థాపకత విద్య 21వ శతాబ్దపు అనిశ్చితులను నావిగేట్ చేయడానికి, యువతకు ఎదురయ్యే సమస్యల నుంచి తిరిగి పుంజుకోవడానికి అవసరమైన వినూత్న ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ ప్రోగ్రామ్‌లను ప్రదర్శించడంతో పాటు, అనుకూలత, స్థితిస్థాపకతలు, భవిష్యత్ కార్యకలాపాల గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఆయనకు ప్రిన్సిపాల్ రామకృష్ణ, ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, స్టాఫ్ సెక్రెటరీ శ్రీనివాస్, జిల్లా బాధ్యుడు శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.